

గుండ బ్రహ్మయ్య జాతరకు వేళాయె

సంగెం : మండలంలోని గవిచర్ల గ్రామంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా గుండ బ్రహ్మయ్య జాతర అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. జాతర నిర్వహణకు దేవాలయ ప్రాంగణాన్ని ముస్తాబు చేస్తున్నారు. ఎంతో ప్రసిద్ధి గాంచిన ఈ జాతరకు గవిచర్లతో పాటుగా మండలంలోని రాంచంద్రపురం, లోహిత, షాపూర్, తీగరాజుపల్లి, కాపులకనిపర్తి, ఆశాలపల్లి తదితర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో ఎడ్లబండ్లపై తరలివస్తారు. నేడు(బుధవారం) రాత్రి జాతర భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నారు.

ఏర్పాట్లు పూర్తి..

గ్రామంలో అత్యంత వైభవంగా నిర్వహించే గుండ బ్రహ్మయ్య జాతరకు అవసరమైన ఏర్పాట్లు అన్ని పూర్తి చేసినట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కొంతం యాదగిరి, సర్పంచ్ దొనికెల రమ, ఎంపీటీసీ సంపత్‌రెడ్డి తెలిపారు. జాతర సమయంలో భక్తులు సంయమనం పాటించి అందరికి దర్శనం కలిగేలా చూడాలని ఇతరులకు ఇబ్బందులు కలుగకుండా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



శివలింగం, గుండ బ్రహ్మయ్య విగ్రహాలు



మంత్రిని కలిసిన సెర్ప్ ఉద్యోగులు

వర్ధన్నపేట : మండల కేంద్రానికి చెందిన సీసీ గోలి కొమురయ్యతో పాటు వివిధ మండలాల ఉద్యోగ సంఘాల నాయకులతో కలిసి పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, ఎమ్మెల్యే అరూరి రమేష్‌లను మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. 21సంవత్సరాలుగా చాలీచాలని జీతాలతో వ్యయ ప్రయాసలను ఎదుర్కొంటూ సామాజిక అభివృద్ధి ధ్యేయంగా సెర్ప్ ఉద్యోగులు పనిచేశారని కొమురయ్య అన్నారు. మంత్రి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేసి ఉద్యోగ సంఘాల నాయకులు స్వీట్లు తినిపించారు. అశోక్, వేణు, రమేష్, స్వామి, అనిల్ కుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ‘చల్లా’కు సన్మానం..

గీసుకొండ : పరకాల నియోజకవర్గంలోని ఏపీఎంలు, సీసీలు మంగళవారం ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆయనను శాలువాతో సన్మానించారు.

గుడుంబా స్వాధీనం

వరంగల్ (పర్వతగిరి) : మండలంలోని టూక్యాతండాకు చెందిన మాలోత్ వీరన్న గుడుంబా తయారు చేస్తున్నాడనే సమాచారం మేరకు మంగళవారం దాడులు నిర్వహించినట్లు ఎస్సై దేవేందర్ తెలిపారు. ఆరు లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకుని 20లీటర్ల పానకాన్ని ధ్వంసం చేశామన్నారు. అలాగే నెక్కొండ మండలం మహబూబ్‌నాయక్‌తండాకు చెందిన భూక్యా శ్రీను వద్ద 15లీటర్ల గుడుంబాతో పాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

మతిస్థిమితం లేని మహిళ అప్పగింత

నర్సంపేట రూరల్: నర్సంపేట మండలంలోని భాంజీపేట గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని మహిళను పోలీస్, సఖి వన్‌స్టాఫ్ సెంటర్, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం ఆమెను తల్లి, చెల్లికి అప్పగించారు. మహిళకు మతిస్థిమితం సరిగా లేదని, బయట తిరగనియొద్దని కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


రైతులకు పరిహారం చెల్లించాలి

నర్సంపేట రూరల్/ నెక్కొండ /సంగెం/ గీసుకొండ / ఖానాపురం / చెన్నారావుపేట : వడగళ్ల వానకు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు చేతికొచ్చే సమయంలో పూర్తిగా దెబ్బతిన్నాయి.. తక్షణమే జిల్లా అధికారులు స్పందించి క్షేత్ర స్థాయి సర్వే నిర్వహించి రైతులకు నష్టపరిహారం చెల్లించాలని వైఎస్సార్ టీపీ జిల్లా అధ్యక్షుడు నాడెం శాంతికుమార్, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, బీజేపీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, కాంగ్రెస్ పరకాల ఇన్‌చార్జ్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ చెన్నారావుపేట మండల అధ్యక్షుడు భూక్యా గోపాల్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయా మండలాల్లో నేల వాలిన మొక్క జొన్న, వరి, మిర్చి టమాట తదితర పంటలను మంగళవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అకాల వర్షానికి, వడగళ్ల వానతో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, గ్రామస్థాయిలో నష్టపోయిన రైతులకు ఎకరాకు లక్షరూపాయలు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.



నెక్కొండ: మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న నాడెం శాంతికుమార్





ఉత్తమ ఫలితాలు సాధించాలి

చెన్నారావుపేట : పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని సెక్టోరియల్ అధికారి కుడికాల సుభాష్ అన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడి పలు సూచనలు చేశారు.

చెక్కు అందజేత

వరంగల్ (పర్వతగిరి) : మండలంలోని హట్యతండాకు చెందిన బాదావత్ అనిల్ ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో ఇటీవల మృతి చెందాడు. బీఆర్ఎస్ పార్టీ క్రియాశీల సభ్యత్వం తీసుకున్న అనిల్‌కు మంజూరైన రూ.2లక్షల పార్టీ ఇన్సూరెన్స్ చెక్కును మంగళవారం ఎమ్మెల్యే అరూరి రమేష్ బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

గణితాన్ని ఇష్టపడి చదవాలి

చెన్నారావుపేట : విద్యార్థులు గణితాన్ని కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని సైన్స్ సెంటర్ ఫీల్డ్ కో ఆర్డినేటర్ సాయిని అశోక్‌కుమార్ అన్నారు. మండలంలోని ఉప్పరపల్లి హైస్కూల్‌లో మంగళవారం తెలంగాణ శాస్త్ర సాంకేతిక మండలి. హనుమకొండ సైన్స్ సెంటర్ ఆధ్వర్యంలో నేషనల్ మ్యాథమెటిక్స్ డే ఉత్సవాలలో భాగంగా గణితంపై వివిధ పోటీలు నిర్వహించారు.





